


## మహిళల చీఫ్ కోచ్‌పై వేటు

- టీమ్ బస్సులో మద్యం తాగిన జైసింహా
- సస్పెన్షన్ విధించిన హెచ్‌సీఏ
- తప్పులు చేస్తే జీవితకాల నిషేధం: జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో అలజడి. ప్లేయర్లను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన కోచ్ వారి పట్ల అనుచితంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అండర్-23 వన్డే టోర్నీ కోసం హైదరాబాద్ మహిళల సీనియర్ జట్టుతో కలిసి బస్సులో ప్రయాణించిన చీఫ్ కోచ్ విద్యుత్ జైసింహా మద్యం తాగడం తాజాగా బయటపడింది. నిబంధనలకు విరుద్ధంగా జైసింహా మద్యం సేవిస్తున్న ఫొటోలు, వీడియోలు ఈ నెల 15న హెచ్‌సీఏకు ఈమెయిల్ ద్వారా అందినట్లు తెలిసింది. దీంతో వెంటనే స్పందించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు.. జైసింహాపై సస్పెన్షన్ విధిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించే వారిని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని జగన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన జగన్.. సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జీవితకాలం పాటు నిషేధం విధించేందుకు కూడా వెనుకాడబోమని ఆయన అన్నారు. ప్రస్తుతం మహిళా క్రికెటర్లతో తమ సిబ్బంది మాట్లాడుతున్నారని త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## శ్రీజ సంచలనం

బుసాన్(దక్షిణకొరియా): ప్రతిష్ఠాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ ప్యాడ్లర్లు ఆకుల శ్రీజ, ఐహిక ముఖర్జీ సంచలన ప్రదర్శనతో విజృంభించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో శ్రీజ 11-7, 11-9, 13-11తో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ యిడిపై అద్భుత విజయం సాధించింది.

# ఇంగ్లండ్ దీటుగా..

**దంచికొట్టిన డకెట్**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 207/2 • భారత్ తొలి ఇన్నింగ్స్ 445 • అశ్విన్ @ 500**

ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలు చేశారు.. మరో ముగ్గురు చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడారు.. బోర్డు మీద మంచి స్కోరే పెట్టాం అనుకున్న టీమ్‌ఇండియాకు గట్టి దెబ్బే తగిలింది!

సిరీస్ ఆరంభం నుంచి 'బజ్‌బాల్' పాట పాడుతున్న ఇంగ్లండ్ బ్యాటర్లు.. మరోసారి దాని ప్రతాపమేంటో చూపారు. ఆడుతున్నది టెస్టు మ్యాచా.. లేక టీ20నా అన్నట్లు రాజ్‌కోట్‌లో పరుగుల వరద పారించారు!

ఓపెనర్ బెన్ డకెట్ రికార్డు సెంచరీతో చెలరేగితే.. మిగిలినవాళ్లు అతడికి మద్దతుగా నిలిచారు. ఫలితంగా ఒక్క సెషన్‌లోనే మన స్కోరులో దాదాపు సగం పూర్తి చేసిన ఇంగ్లండ్.. మంచి స్థితికి చేరింది. బ్యాటింగ్‌లో విలువైన పరుగులు జోడించిన అశ్విన్.. బౌలింగ్‌లో 500 టెస్టు వికెట్లు పూర్తి చేసుకోవడం టీమ్‌ఇండియాకు ఊరటనిచ్చే అంశం!!



డకెట్ (133*)



మ్యాచ్‌లు 98 / 500 వికెట్లు

అశ్విన్ (1/37)

రాజ్‌కోట్: ఓపెనర్ బెన్ డకెట్ (118 బంతుల్లో 133 బ్యాటింగ్; 21 ఫోర్లు, 2 సిక్సర్లు) వీర విజృంభణతో మూడో టెస్టు రసకందాయంలో పడింది. భారీ స్కోరు చేశామనుకున్న టీమ్‌ఇండియాకు ఒక్క సెషన్‌లోనే డకెట్ చుక్కలు చూపాడు. బంతి ఎలా పడ్డా దాని గమ్యస్థానం బౌండ్రీనే అన్నట్లు విరుచుకుపడిన డకెట్.. భారత గడ్డపై వేగవంతమైన శతకం చేసిన ఇంగ్లండ్ బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. డకెట్ విధ్వంస కాండతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. మరో ఓపెనర్ జాక్ క్రాలీ (15) త్వరగానే ఔటైనా.. ఓలీ పోప్ (39; 5 ఫోర్లు, ఒక సిక్సర్)తో కలిసి డకెట్ దంచికొట్టాడు. స్వీప్, రివర్స్ స్వీప్, దిల్ స్కూప్, స్విచ్ హిట్.. ఇలా ఒక్కటేంటి టీ20 క్రికెట్‌లోని షాట్లన్నింటినీ సంప్రదాయ ఆటలో చూపాడు. భారత స్పిన్నర్లను ఎదుర్కోవడం ఇంత తేలికా అన్నట్లు డకెట్ విశ్వరూపం చూపాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న ఇంగ్లండ్.. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. డకెట్‌తో పాటు మాజీ కెప్టెన్ జో రూట్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. క్రాలీ వికెట్ తీయడం ద్వారా అశ్విన్ టెస్టుల్లో 500 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. సిరాజ్‌కు ఒక వికెట్ దక్కింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 326/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రోహిత్ సేన 445 పరుగులకు ఆలౌటైంది. జడేజా (112) క్రితం రోజు స్కోరుకు రెండు పరుగులు చేసి వెనుదిరగగా.. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (46; 2 ఫోర్లు, 3 సిక్సర్లు), అశ్విన్ (37), బుమ్రా (26) విలువైన పరుగులు జోడించారు.

### సంక్షిప్త స్కోర్లు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 445 (రోహిత్ 131, జడేజా 112; వుడ్ 4/114, రెహాన్ 2/85); **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 207/2 (డకెట్ 133 నాటౌట్; అశ్విన్ 1/37, సిరాజ్ 1/54).

### ఐదు పరుగుల పెనాల్టీ..

బ్యాటింగ్ చేస్తున్న సమయంలో అశ్విన్ డేంజర్ ఏరియాలో పరిగెత్తినందుకు గానూ.. ఈ మ్యాచ్‌లో భారత జట్టుకు పెనాల్టీ విధించారు. దీంతో మ్యాచ్ ఆరంభానికి ముందే ఇంగ్లండ్ స్కోరు బోర్డుపై 5/0 దర్శనమిచ్చింది. ఫ్రీగా వచ్చిన పరుగుల స్ఫూర్తిని ఇంగ్లండ్ చివరి వరకు కొనసాగించింది.

**1** సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక మ్యాచ్‌లో వరుసగా రెండు రోజులు సమానమైన పరుగులు నమోదు కావడం ఇదే తొలిసారి. గురువారం భారత్ 326 పరుగులు చేయగా.. శుక్రవారం ఇరు జట్లు కలిపి కూడా సరిగ్గా 326 రన్స్ కొట్టాయి.

**2** భారత్ నుంచి 500 టెస్టు వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా అశ్విన్ నిలిచాడు. అనిల్ కుంబ్లే (619) ముందున్నాడు.

### బ్యాటర్ అవుదామనుకొని..

*టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించిన అశ్విన్.. అసలు బౌలర్ కావాలనే అనుకోలేదంటే నమ్మగలరా! ప్రాక్టీస్ ప్రారంభించిన తొలినాళ్లలో బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టిన అశ్విన్.. ఆ తర్వాత ఆఫ్‌స్పిన్‌ను తన అస్త్రంగా మార్చుకున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్న ప్రతిసారి బ్రేక్‌త్రూ ఇప్పించడంతో పాటు.. టెస్టు క్రికెట్‌లో అటు బ్యాట్‌తోనూ జట్టుకు ఎన్నో ఉపయుక్త కర ఇన్నింగ్స్‌లు ఆడిన 37 ఏండ్ల అశ్విన్.. ఇప్పుడు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో క్రాలీని ఔట్ చేయడం ద్వారా అశ్విన్ 500 టెస్టు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. భారత్ నుంచి ఈ క్లబ్‌లో చేరిన రెండో బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. అనిల్ కుంబ్లే (619) అగ్రస్థానంలో ఉన్నాడు. టెస్టుల్లో ఇప్పటి వరకు ఆఫ్‌స్పిన్నర్లు ముత్తయ్య మురళీధరన్ (800), నాథన్ లియాన్ (517) మాత్రమే 500 వికెట్లు పడగొట్టారు. తన జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశానన్న అశ్విన్.. తనలో వికెట్లు తీయాలనే కసి ఇంకా తీరలేదని పేర్కొన్నాడు.*

### అశ్విన్ ఇంట ఎమర్జెన్సీ!

రాజ్‌కోట్ టెస్టు నుంచి ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ తప్పుకున్నాడు. కుటుంబంలో అత్యవసర ఆరోగ్య పరిస్థితి నెలకొనడంతో మూడో టెస్టుకు దూరమయ్యాడు. ఈ మేరకు బీసీసీఐ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

# అమ్మాయిలు అదుర్స్

**చారిత్రక పతకం ఖాయం • ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్**



షా ఆలమ్: భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు.. సంచలన ప్రదర్శనతో ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకం ఖాయం చేసుకుంది. మలేషియా వేదికగా జరుగుతున్న మెగాటోర్నీలో పీవీ సింధు సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌పై విజయం సాధించింది. టైలో భాగంగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి పోరులో రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధు 21-7, 16-21, 21-12తో లో సిన్ యాన్‌పై గెలిచి బోణీ కొట్టగా.. డబుల్స్ మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా జోడీ 21-10, 21-14తో యెంగ్ నెగా టింగ్-యెంగ్ లామ్ ద్వయంపై గెలుపొందింది. మరో సింగిల్స్ మ్యాచ్‌లో యువ షట్లర్ అష్మిత చలిహ 21-12, 21-13తో యెంగ్ సుమ్ యీపై నెగ్గింది. దీంతో ఈ టోర్నీలో తొలిసారి భారత మహిళల జట్టుకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. మరో వైపు పురుషుల క్వార్టర్ ఫైనల్లో మన జట్టు 2-3తో జపాన్ చేతిలో ఓడింది.

# అనాబెల్ ఫాస్టెస్ట్ డబుల్




అనాబెల్ (210)

పెర్త్: మహిళల టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా ప్లేయర్ అనాబెల్ సథర్‌లాండ్ (256 బంతుల్లో 210; 27 ఫోర్లు, 2 సిక్సర్లు) ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ కొట్టింది. అనాబెల్ 248 బంతుల్లో ద్విశతకం నమోదు చేసుకుంది. ఆస్టేలియా మాజీ ప్లేయర్ కారెన్ రాల్టన్ (306 బంతుల్లో) ఘనత రెండో స్థానానికి చేరింది. అనాబెల్ దంచికొట్టడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఆస్ట్రేలియా 575/9 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనాబెల్‌తో పాటు కెప్టెన్ అలీసా హీలీ (99), ఆష్లే గార్డ్‌నర్ (65), బెత్ మూనీ (78) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగులకే ఆలౌటైన దక్షిణాఫ్రికా.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసింది.

# న్యూజిలాండ్ నయాచరిత్ర




హామిల్టన్: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు నయా చరిత్ర లిఖించింది. సుదీర్ఘ టెస్టు క్రికెట్‌లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలువని కివీస్.. ఈ సారి ఆ అద్భుతాన్ని ఆవిష్కరించింది. శుక్రవారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో సఫారీలను చిత్తు చేసి 2-0తో సిరీస్ పట్టేసింది. 267 పరుగుల లక్ష్యఛేదనలో.. ఓవర్‌నైట్ స్కోరు 40/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 3 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసి గెలుపొందింది. మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (133 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) మరో సెంచరీతో చెలరేగగా.. విల్ యాంగ్ (60 నాటౌట్) అతడికి సహకరించాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులు చేయగా. న్యూజిలాండ్ 211 రన్స్ కొట్టింది. దేశవాళీ టీ20 లీగ్ సాగుతున్న నేపథ్యంలో ఈ సిరీస్‌కు దక్షిణాఫ్రికా బోర్డు ద్వితీయశ్రేణి జట్టును ఎంపిక చేసిన విషయం తెలిసిందే. రెండు మ్యాచ్‌ల్లో కలిపి 3 సెంచరీలు సహా 403 రన్స్ చేసిన విలియమ్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.